అధ్వానంగా అంతర్గత దారులు

- వర్షాలకు చిత్తడిగా మారుతున్న వీధులు
- డ్రెయినేజీలు లేక రోడ్లపైకి మురుగునీరు



సైడ్‌డ్రెయిన్ లేకపోవడంతో రహదారిపైనే నిలిచిన వరదనీరు



దండుపేటలో చిత్తడిగా తయారైన అంతర్గత రహదారి

చర్ల: మండలంలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. వర్షాలకు రోడ్లపైనే నీరు నిలిచి చిత్తడిగా మారుతున్నాయి. రహదార్లు గుంతలమయం కావడం, మురుగునీటి కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రహదార్లపై రాకపోకలు సాగించే ప్రజానీకం నానాపాట్లు పడుతున్నారు.

మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్, సాలె బజార్, ఎంపీడీఓ కార్యాలయం వెనుక ప్రాంతాలతో పాటు గుంపెన్నగూడెం, దండుపేట, కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లి, కొయ్యూరు, సుందరయ్య కాలనీ, సింగసముద్రం, ఉప్పరిగూడెం, పూసుగుప్ప, ఉంజుపల్లి, చినమిడిసిలేరు, ఆంజనేయపురం, కొత్తూరు, ఆర్ కొత్తగూడెం, కుదునూరు, దేవరాపల్లి, మామిడిగూడెం, రాళ్లగూడెం, దానవాయిపేట, బూరుగుపాడు, బోదనెల్లి, కుర్నపల్లి తదితర గ్రామాల్లోని అంతర్గత రహదార్లు అధ్వానంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లపై పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరి బురదమయంగా మారతున్నాయి. మండల కేంద్రాల్లో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించినప్పటికీ మురుగునీరు దిగువకు వెళ్లేందుకు వీలుగా డ్రెయినేజీలను నిర్మించకపోవడంతో ఇళ్లల్లోని నిరంతా రోడ్లపైకే చేరుతోంది. రహదార్లపై నిలిచిన మురుగునీటి వల్ల ద్విచక్ర వాహనదారులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో మోకాళ్లలోతున ఏర్పడుతున్న బురద రోడ్లపై రాకపోకలు సాగించే పేదలు, వ్యవసాయ కూలీలు అవస్థలు పడుతున్నారు. ప్రతీ సారి ఎన్నికల సందర్భంలో వచ్చే నాయకులు, ప్రజాప్రతినిధులు ఓసారి బురదమయంగా మారిన రహదార్లను పరిశీలించాలని ఆయా ప్రాంతాల్లోని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



బూరుగుపాడుకు వచ్చే రోడ్డు మొత్తం బురదమయం అయ్యింది. కనీసం నడవడానికి కూడా వీలు పడడం లేదు. గ్రామం నుంచి భయటకు వెళ్లడానికి, భయట నుంచి గ్రామంలోని రావడానికి చాలా ఇబ్బందిగా ఉంది. గతంలోనూ గుంతలుగా ఉన్న రహదారి ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయింది. అధికారులు వెంటనే బురదమయంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– కలుము గంగ, బూరుగుపాడు

సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలి



గ్రామాల్లోని రోడ్లకు ఏళ్ల తరబడిగా మరమ్మతులు చేయలేదు. దీంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా ఇసుకను తరలించే గోదావరి సమీపాల్లోని గ్రామాల్లో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లోనూ ఉన్న అంతర్గత రహదార్లు బురదమయమయ్యి ప్రజలు నడవడానికి కూడా సాధ్యం కావడం లేదు. అన్నీ గ్రామాల్లోనూ సీసీ రోడ్లు నిర్మించి, సైడ్ డ్రెయిన్లు కూడా ఏర్పాటు చేయాలి.

– కల్లూరి వెంకటేశ్వరరావు, సీపీఐ డివిజన్ కార్యదర్శి

మాదకద్రవ్యాలకు బానిస కావద్దు



చర్ల: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రాజువర్మ

భద్రాచలంటౌన్: యువత దేశానికి వెన్నెముకని, మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థలకు బానిసలై జీవితాలను బలి చేసుకోవద్దని ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సూచించారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయ యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. ఏఎస్పీ పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలు విద్యార్థులలో ఆరోగ్యంపై మాత్రమే కాక వారి భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపుతాయని వివరించారు. డ్రగ్స్ తీసుకోవడం మాత్రమే కాదు డ్రగ్స్ దాచుకోవడం కూడా నేరమని అటువంటి వారిపై చట్టబడమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో లైబ్రరియన్ జానీ, నాగేశ్వరరావు, వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: యువత మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అప్పుడే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని చర్ల సీఐ రాజువర్మ అన్నారు. చర్లలోని శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు చర్ల సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, మద్యం, గుట్కాలు వంటి వాటి జోలికి ఏ మాత్రం వెళ్లవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో చర్ల ఎస్సై కేశవ్, శాఖా గ్రంథాలయ పాలకుడు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంగా జంగయ్య



భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా పి.జంగయ్య గురువారం బాధ్యలు చేపట్టారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న జంగయ్య పదోన్నతిపై భద్రాచలం డిపో మేనేజర్‌గా వచ్చారు. గతంలో ఇక్కడ డీఎంగా పనిచేసిన తిరుపతిని హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌కు ఆర్టీసీ ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

దోమతెరల పంపిణీ

పినపాక: మండలంలోని కొత్తూరు కాలనీ, ముద్దులగూడెం గ్రామాల్లోని ఆదివాసీలకు మహర్షి స్వచ్ఛంద సంస్థ సభ్యులు గురువారం దోమతెరలు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ.. హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో వంద కుటుంబాలకు దోమతెరలు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

యువత శ్రమదానం

అశ్వాపురం: అశ్వాపురం మండలం అమెర్ధ పంచాయతీలోని కోర్సవారిగూడెం రోడ్డు పూర్తిగా గుంతలమయం అవడంతో యువకులు, స్థానికులు చందాలు వేసుకుని స్వచ్ఛందంగా గురువారం రోడ్డు మరమ్మతులకు శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ.. రోడ్డు అధ్వానంగా ఉండి ఎవరూ పట్టించుకోకపోవడంతో తామంతా కలిసి చందాలు వేసుకొని రోడ్డు మరమ్మతులు చేపట్టామని తెలిపారు.

21న మహాసభ

ములకలపల్లి: ఈ నెల 21వ తేదీన హేతువాద సంఘ 5వ వార్షిక మహాసభలు ఏర్పాటు చేసినట్లు సంఘ ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల అధ్యక్షుడు నబీసాహెబ్, పి.క్రాంతి తెలిపారు. ములకలపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాల్వంచ నిర్వహించే ఈసభల్లో హేతువాద, మానవవాద అధ్యయన తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బరగడ దేవదానం. ఎన్‌డీటీ హుస్సేన్, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ ఎక్స్‌పోను విజయవంతం చేయండి

పినపాక: రాష్ట్ర ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని జిల్లా ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కీసర సుధాకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలో ఫొటోగ్రాఫర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ ఎక్స్‌పోలో అధునాతన కెమెరాలు, లెన్సులు, డ్రోన్లు, ప్రింటింగ్ పరికరాలు, ఫొటో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్‌లు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు ఎక్స్పోలో పాల్గొని ప్రయోజనం పొందాలని కోరారు.

పీఓకు వినతి

చంద్రుగొండ: సమస్యలు పరిష్కరించాలని మండలంలోని బెండాలపాడు గ్రామానికి చెందిన దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేశ్, ఏటీడీఓ పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. భద్రాచలంలోని కార్యాలయంలో పీఓను కలిసి, గత ప్రభుత్వం సర్వే చేసిన భూములను పంపిణీ చేయలేదని అన్నారు.

యూరియా సరఫరాలో విఫలం



తహసీల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

దమ్మపేట: రైతులకు తగినంత యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము అన్నారు. గురువారం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాసేపు నిరసన చేపట్టిన అనంతరం కార్యాలయంలో వినతి పత్రము అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడారు. కార్యక్రమంలో వీరబాబు, ప్రసాద్, కాంతారావు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలు అందించాలి

మణుగూరురూరల్: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌కు నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు క్రెడిట్ సొసైటీ సభ్యులు పారదర్శకంగా సేవలు అందించాలని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సీఈ బి.బిచ్చన్న సూచించారు. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్–1535 రీజినల్ కమిటీ నుంచి నూతనంగా ఎన్నికైన క్రెడిట్ సొసైటీ డైరెక్టర్లు దాసరి వీరమణి, సిద్దెల హుస్సేన్‌లు గురువారం సీఈ బిచ్చన్నను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బిచ్చన్న వారికి శుభాకాంక్షలు తెలిపి పై విధంగా స్పందించారు. అనంతరం సీఈని డైరెక్టర్లు, యూనియన్ నాయకులు శాలువాతో సన్మానించారు. టీఎస్‌పీఈయూ–1535 రీజినల్ అధ్యక్షుడు వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎం.రాజ మనోహర్, ఎస్‌డి.రఫీ, ఉపాధ్యక్షులు జాన్ రెడ్డి, పిల్లి మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హాస్టళ్ల వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గురువారానికి ఈ సమ్మె ఏడవ రోజుకు చేరింది. కార్మికులు ర్యాలీలు, ధర్నాలు, నినాదాలతో తమ నిరసన తెలిపారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, టీపీటీఎఫ్ నాయకులు సమ్మె శిబిరాలను సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వేతనాల పెంపు, బకాయిల చెల్లింపు తదతర డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను కార్మికుల తరుపున అధికారులకు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న హాస్టల్ వర్కర్లు



దమ్మపేట: తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న డైలీవేజ్ వర్కర్లు



అశ్వాపురం: డీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: రాష్ట్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం బంగ్లాస్ ఏరియాలోని ఇల్లెందు అతిథిగృహంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత అన్ని విభాగాల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా రైతులకు ఇప్పటి వరకు అందిన బోనస్, రుణమాఫీ, ఎరువుల లేమి వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అధికారుల నుంచి నూతనంగా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ వంటి వివరాలు తెలుసుకుని నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఆయా విభాగాల సొంత భవనాల వివరాలు ఆరా తీసి ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడంటూ హౌసింగ్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 పడకల ఆస్పత్రి, శివలింగాపురం పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలందుతున్నాయని అభినందించారు. అధికారులందరూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న అన్ని పథకాలకుగాను ఆధార్ లింక్ వంటి టెక్నికల్ లోపాలను సరిచేసి అర్హతను గుర్తించాలని సూచించారు. మరోవైపు, మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు పంపిణీ చేశారు. సమీక్ష సమావేశంలో మండల ప్రత్యేకాధికారి స్వర్ణ జ్యోతి లెనినా, తహసీల్దార్ నరేశ్‌తోపాటు అన్ని శాఖల అధికారులు, బాధ్యులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్యపరీక్షలు



దుమ్ముగూడెం: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రేణుకారెడ్డి

అశ్వాపురం: స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళలకు పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. సరైన పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందించారు. టీబీ వ్యాధిని గుర్తించడానికి పరీక్షలు చేశారు. మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. వృద్ధులు ఆరోగ్య సమస్యల కోసం ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి మోహన్, ఆయుర్వేద వైద్యురాలు అరుణ, సూపర్‌వైజర్ పుష్పవతి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సుజ్ఞానపురంలో మెడికల్ క్యాంప్..

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పీహెచ్‌సీ పరిధిలోని సుజ్ఞానపురం గ్రామంలో డాక్టర్ రేణుక రెడ్డి ఆధ్వర్యంలో గురువారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, జ్వరంతో ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అలాగే గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వేలో భాగంగా ఇంటింటి సర్వే చేయడం, యాంటీ లార్వా ఆపరేషన్ చేయడం వివరించారు. గ్రామస్తులకు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాగ్యవతి, నాగేశ్వరరావు, భూలక్ష్మి, ఆశా వర్కర్ లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి



దమ్మపేట: వినతిపత్రం అందజేసిన రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

దమ్మపేట: వరుణ్ అగ్రోటెక్ విత్తన కంపెనీ నుంచి కొనుగోలు చేసిన వరి విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయిన కారణంగా తమకు న్యాయం చేయాలని కోరుతూ.. ఖమ్మం జిల్లా పరిధిలోని కందుకూరు, భరణిపాడు గ్రామాలకు చెందిన రైతులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గండుగులపల్లిలో గురువారం వినతిపత్రం అందజేశారు. తన నివాసంలో కలసిన స్థానిక ఆదివాసీ మహిళలను మంత్రి తుమ్మల కోయ భాషలో మాట్లాడి, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందుగా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంత్రి తుమ్మలను కలసి, కాసేపు ఏకాంతంగా మాట్లాడారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ములకలపల్లి: ములకలపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ ఆధ్వర్యంలో గండుగులపల్లిలోని స్వగృహంలో కలిసి స్థానిక సమస్యలు విన్నవించారు. పామాయిల్ సాగు, వెదురు, మునగ తోటల పెంపకంపై దృష్టి సారించాలని మంత్రి వారికి సూచించారు. మాజీ ఎంపీటీసీలు తాటి తులసి, సున్నం సునిత, శనగపాటి అంజి, మిరియాల అవినాశ్, సురభి రాజేష్, గుంట్రు కృష్ణ, నల్లమోతు జగదీష్, మహేష్, ఉమేశ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సొసైటీ ఏర్పాటు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏలో పాలక మండలి సొసైటీని ఏర్పాటు చేయాలి అందులో అధ్యక్షుడు, డైరెక్టర్లుగా ఆదివాసులనే నియమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పీఓ రాహుల్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు సోందె మల్లు దొర రేసు ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ.. ఆదివాసులతోనే పాలక మండల సొసైటీని ఏర్పాటు చేయడం ద్వారా నిధులు పూర్తిస్థాయిలో కోయా తెగలకు ఆదివాసీ జాతి అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పూనం ముతేష్, సొందె వెంకటరమణారావు, రామ్మూర్తి, శ్రీను పాల్గొన్నారు.

పోడు భూములకు విద్యుత్ సౌకర్యం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఏడీఈ, ఏఈ, రైతులు

అశ్వారావుపేటరూరల్: పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన రైతుల పొలాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ వెంకట రత్నం తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని వినాయకపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 39 మంది పోడు రైతుల పొలాలకు రూ.70లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఛార్జింగ్ చేయించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందుతుందని, త్వరలోనే మిగిలిన రైతుల పొలాలకు కుడా విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని తెలిపారు. వినాయకపురం సబ్ స్టేషన్ ఏఈ సంతోష్, లైన్ ఇన్‌స్పెక్టర్ తాటి ప్రసాద్, రైతులు రమేష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామంలోని రైతువేదికలో నానో యూరియా, నానో డీఏపీల వినియోగంపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఏఓ బాబురావు రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీల వలన తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం ఉంటుందని రైతులకు వివరించారు. సమావేశంలో ఏటీఎంఏ డీపీడీ సరిత, ఏడీఏ సుధాకర్‌రావు, ఎంఏఓ నవీన్‌కుమార్, ఏఈఓలు హసీనా, బాలాజీ, ప్రవీణ్, ఫెర్టిలైజర్స్ మండల డీలర్లు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు



సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలో సెంట్రల్ లైటింగ్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. గురువారం పని చేయని లైట్లు తొలిగించి కొత్త వాటిని అమర్చారు. వైరింగ్ పూర్తిగా పాడయి సమస్య లైటింగ్ సమస్యలు తీవ్రం అవుతుండగా.. ఆర్మ్మర్ కేబుల్‌ను ఇప్పటికే అమర్చారు. ఎంసీబీ బాక్సులు అమరుస్తూ లైట్లు మార్చి కనెక్షన్ సమస్యలను పరిష్కరిస్తున్నారు. మరో వారం రోజుల్లో సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి వస్తుందని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు స్పాట్ అడ్మిషన్లు

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 19 తేదీన స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ చివరి అవకాశంగా నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రవి బండారుపల్లి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన లేదా తత్సమాన అర్హత కలిగిన గిరిజన విద్యార్థులు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి శుక్రవారం చివరి అడ్మిషన్ ప్రక్రియగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సమర్పించి అడ్మిషన్ పొందాలని సూచించారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పొలంలో శాస్త్రవేత్తలు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లితోపాటు, ములకలపల్లి మండలాల్లో కొత్తగూడెంకు చెందిన కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం గురువారం పంటల సేద్యాన్ని పరిశీలించారు. వరి. పత్తి, మునగ చేలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. 'నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా ప్రయోగాత్మకంగా ఆరుగురు రైతులు ఇచ్చిన వరి విత్తన సేద్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ భరత్, శివ, నవీన్, ఏడీఏ రవికుమార్, ఏఓలు అనూష, వినయ్, ఏఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



టీవీ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

చంద్రుగొండ: మండలంలోని బుర్రాయిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిర పాఠశాలకు.. భద్రాచలం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్య, టీచర్స్ కృష్ణకుమారి, గామస్తులు మాధవి, హరిష్, రమేశ్‌రెడ్డి, శైలజ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయితీ సాయినగర్‌లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలమ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్.బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పోరాటాలు

బూర్గంపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికే సీపీఎం నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బి.నర్సారెడ్డి అన్నారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అదేవిధంగా పల్లె, పట్టణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజని, బయ్యా రాము, ఎస్‌కె.అబీదా, కనకం వెంకటేశ్వర్లు, గుంటక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన గురుకులంలో జోనల్ స్థాయి ఆటల పోటీలను దమ్మపేట మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి గురువారం ప్రారంభించారు. క్రీడాకారులను ఎంఈఓ పరిచయం చేసుకుని, ఆటల పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చూపాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో అశ్వారావుపేట ఎంఈఓ ప్రసాదరావు, వ్యాయాయ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.